www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025



అత్యాచారం ఘటనలో వార్డెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ ఘటనపై ఇకెఆర్‌సిస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర విచారణ చేపట్టగా, విచారణలో హాస్టల్ సంక్షేమ అధికారి ఉమాదేవి విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ కావడంతో విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. జిల్లాలోని వసతిగృహాల్లో ఉండే పిల్లల విషయంలో వార్డెన్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. వసతిగృహాల నుంచి పిల్లలను పంపేముందు, పిల్లల సంరక్షణలో భద్రతను గరిష్ఠంగా నిర్ధారిస్తూ, బంధువుల వివరాలను, తగిన ఆధారాలను ముందుగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే పంపాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సంబంధిత అధికారులు, సిబ్బంది ఈ సూచనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు.

తహశీల్దార్ల కొరత... సమస్యల కలత

- 26 పోస్టులకు 16 మంది మాత్రమే
- గత కొన్నేళ్లుగా ఇన్‌ఛార్జులతోనే సరి



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో తహశీల్దార్ల పూర్తి స్థాయిలో లేకపోవడంతో మండలాల్లో స్థానిక సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ఈ సమస్యపై ప్రభుత్వ పెద్దల చొరవ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు తప్పట్లేదు. మరోవైపు ఉన్నతాధికారులకు ఈ సమస్యలు అదనపు ఒత్తిడికి గురి చేస్తున్నాయి. కలెక్టరు కార్యాలయంతో పాటు కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ, 19 మండల రెవెన్యూ కార్యాలయాలకు కలిపి మొత్తం 26 తహశీల్దార్ల పోస్టులు ఉండగా వీటిలో గత కొన్నేళ్లు గా తొమ్మిది ఖాళీగా ఉన్నాయి. 17మందిలో ఒకరు డిప్యుటేషన్‌లో ఉండగా 16 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. తహశీల్దార్ల కొరత కారణంగా ప్రజలకు మండల స్థాయిలో సేవలు పూర్తి స్థాయిలో లభించట్లేదు. ప్రజా ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌కు ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. మండల స్థాయిలో పిజిఆర్ఎస్ అర్జీలు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కార్డుల విభజన, 22ఎ భూముల పున్నపరిశీలన, రీ సర్వే అనంతరం జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు, వెబ్‌ల్యాండ్‌లో సవరణలు, ఒకర్ర జాబితా రూపకల్పన వంటి విధుల్లో తహశీల్దార్ల పాత్ర కీలకం. కాగా ప్రస్తుతం ఆ సమస్యలన్నీ నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

కొన్ని సంవత్సరాలుగా భూములకు సంబంధించిన సమస్యలు పెరిగాయి. పిజిఆర్ఎస్‌కు ప్రతివారం వచ్చే ఫిర్యాదులలో అత్యధిక భాగం రెవెన్యూ శాఖ పరిధిలోనే ఉంటున్నాయి. ప్రధానంగా ఇటీవల నిర్వహించిన రీ సర్వే లోపాలు, నిషిద్ధ జాబితాలో భూముల ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా ఆయా మండల కార్యాలయాల్లో ప్రజల దరఖాస్తులు కదలట్లేదు. తహశీల్దార్ల లాగిన్‌లో పరిష్కరించిన తర్వాత ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ లాగిన్లకు వస్తాయి. తహశీల్దార్ల లేకపోవడంతో డిప్యూటీ తహశీల్దార్లపై ఒత్తిడి పెరుగుతోంది. కొత్త రేషన్ కార్డులు, వెబ్‌ల్యాండ్ సవరణలు తదితరాలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

కడియం, బిక్కవోలు, గోపాలపురం, దేవరపల్లి, మండలాల్లో తహశీల్దార్లు లేరు. డిటీలకే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నల్లజర్ల మండలంలో రెగ్యులర్ తహశీల్దార్ ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్‌పై సిఎంఒ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. కలెక్టరేట్‌లో మూడు పోస్టులకు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఉద్యోగోన్నతులకు సంబంధించిన డిటిల సీనియారిటీ విషయంలో నడుస్తున్న కేసు ఉండటం కూడా తహశీల్దార్‌ల కొరతకు ఒక కారణం.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

కొన్ని మండలాల్లో తహశీల్దార్లు లేకపోయినప్పటికీ ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటున్నాము. ఇప్పటికే డిప్యూటీ తహశీల్దార్లకు బాధ్యతలు అప్పగించాం. జిల్లా స్థాయిలో నాతో పాటు మరికొందరు ఉన్నతాధికారులతో ఏర్పడిన కమిటీ రెవెన్యూ, మరియు సర్వే సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బందితో సేవలు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాము.

- టి.సీతారామమూర్తి డిఆర్ఒ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జిజియు విద్యార్థులు

ఫీజుల కోసం ఒత్తిడి తగదు

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిజియు విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఫీజుల కోసం ఒత్తిడి తగదంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ మాట్లాడారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టలేదని యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మొదటి సంవత్సరం ఫీజు కడితేనే సెమిస్టర్ ఫీజు కట్టేలా కళాశాల యాప్‌లో పెట్టారన్నారు. విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ ఫీజులు కట్టాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ వేయకుండా విద్యార్థులు ఫీజులు ఎలా కడతారని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పరీక్ష ఫీజు విషయంలో, సర్టిఫికెట్ తీసుకునే విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయరాదని స్వయంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారన్నారు. అయినప్పటికీ జిజియు యాజమాన్యం దారుణంగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే పెండింగులో ఉన్న రూ.6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై డిఆర్ఒ మాట్లాడారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడతామని, సెమిస్టర్ ఫీజుకు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు లింకు పెట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాల యాజమాన్యం రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి జిజియుని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హేమంత్, సాహితి, నాయకులు శ్రీవల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాచారం ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సంక్షేమ హాస్టల్ విద్యార్థినిపై అత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, వారిపై కిడ్నాప్ కేసు కూడా పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. హాస్టల్ బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి స్పందించారు. సంక్షేమ హాస్టల్స్‌లో బాలికలకు రక్షణ కొరవడిందన్నారు. బాలిక ఫిర్యాదు చేసేంత వరకు హాస్టల్ నిర్వాహకులు కనీస విచారణ కూడా చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనలో అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంక్షేమ హాస్టల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బాలికలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మోసపూరిత ఫోన్ కాల్స్‌పై జాగ్రత్త

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇటీవలి కాలంలో కొంతమంది ఎసిబి అధికారులు అని చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను మోసగించే ఘటనలు జరుగుతున్నాయని, వారు ఎసిబి అధికారుల పేర్లను ఉపయోగించి ఫోన్ కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అవినీతి నిరోధక శాఖ రాజమహేంద్రవరం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎమ్. కిషోర్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న కాకినాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇలాంటి కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎసిబి అధికారులు ఎప్పటికీ ఫోన్ ద్వారా డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు అడగరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే 9440446160 లేదా కార్యాలయ ల్యాండ్ లైన్ 0883 - 2467833 నెంబర్‌కు నేరుగా ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఇకెవైసి వెరిఫికేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలని ఎపిఒ బివి.సత్యవతి తెలిపారు. బుధవారం నల్లగొండలో ఇసి నాగేశ్వరరావు, మిర్తిపాడు గ్రామపంచాయతీలో ఎపిఒ సత్యవతి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహించారు. నల్లగొండ గ్రామ సభలో 16 పంట కాలవలు, 6 పెద్ద కాలువలు, 2 ఫారమ్‌పాండ్లు, రింగ్ ట్రెంచ్ వర్కులు 5 ఎకరాలు, కేనాల్ ప్లాంటేషన్ 1, చెరువులుపూడిక తీత 2 మొదలగు పనులు గుర్తించారు. మిర్తిపాడు గ్రామ సభలో 14 పంట కాలవలు, 5 పెద్ద కాలువలు 2పారం పాండ్లు 14 సోక్ పిట్లు, 1 కంపోస్ట్ పిట్ పనులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు శేఖర్, వీరబాబు, జివి.కుమార్, గ్రామ పెద్దలు కూటమి నాయకులు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పోలీసులు, విద్యార్థుల ర్యాలీ

పెరవలి : మండలంలో ఖండవల్లిలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వమించారు. హై స్కూల్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ సౌజన్య, ఎఎస్ఐ ప్రసాదరావు కానిస్టేబుళ్లు, హెచ్ఎం టి.పద్మప్రియ పాల్గొన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్వతి

పెరవలి : నిడదవోలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన కాకరపర్రుకు చెందిన సంగీత పార్వతి నాయకులతో వెళ్లి బుధవారం మంత్రి కందుల దుర్గేషన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్‌ను సత్కరించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మండలంలో జనసేన బలంగా ఉందని, సంస్థగతంగా మరింత పటిష్టం చేసి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అందరూ విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిప్పర రవి, సంగీత నాగు, నందిప చక్రవర్తి, అనుకూల శ్రీను, శక్తిబాబు, వీరవల్లి శ్రీను పెన్మత్స మధు, సిరిగినీడి శేషగిరి, కోనా అంజి, సాయి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో జూడో పోటీలు

ప్రజాశక్తి రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో జూడో మెన్ అండ్ ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌ను విసి ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ప్రారంభించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జ్యోతిప్రజ్వలన ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. జూడో క్రమశిక్షణ, గౌరవం, అజేయమైన స్ఫూర్తిని సూచిస్తుందన్నారు. క్రీడలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ పెద్దపీట వేస్తుందన్నారు. గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని, యూనివర్సిటీ నిర్వహించే వివిధ క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం వివిధ కేటగిరీల్లో జూడో మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహించారు. జూడో ఉమెన్ 48 కేజీల కేటగిరి నుంచి 78 కేజీల కేటగిరీ వరకు, జూడో మెన్ 60 కేజీల కేటగిరి నుంచి 100 కేజీల కేటగిరి వరకు పోటీలు జరిగాయి. దీనిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలను యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేసి నవంబర్ 10 నుంచి 14 వరకు సంజీవ్ అగర్వాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ల యూనివర్సిటీ భూపాల్ జరిగే సౌత్ వెస్ట్ జోన్ పోటీలకు పంపిస్తారు. తరువాత విజేతలకు మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. విసి ప్రసన్నశ్రీని నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ కెవి.స్వామి, అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ ఎంవిఎస్ ఎస్ఎన్.మూర్తి, అబ్జర్వర్ డాక్టర్ ఎస్‌విఎల్ఎల్‌జి.వర్మ, మెంబర్స్ పివి.తేజ, టివివి.రమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున గోదావరి నదీ తీర మండలాలు, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయితీ రాజ్, విద్యుత్, రోడ్లు భవనాల శాఖ, జల వనరుఉ, వ్యవసాయం, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి, గోదావరిలోకి వేటకు వెళ్లరాదన్నారు. నదిలో ఉన్న పడవలు వెంటనే ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అవసరమైతే తక్షణ చర్యలు తీసుకునేలా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గోకవరం : పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యం కోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం గోకవరం గ్రామానికి చెందిన కంటిపూడి సునీత రమాదేవికి మంజూరైన రూ.36,278, గాదేలపాలెం గ్రామానికి చెందిన పీత రాజేశ్వర్‌రి రూ.71,834 విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందించారు. నవీన్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా సాయం కోరిన ప్రతి ఒక్కరికి సాయం మంజూరవుతుందన్నారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ నియోజకవర్గంలో ఎవరికైనా సహాయం అందించేందుకు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు జీనుమణి బాబు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం ప్రభుత్వ బిసి హాస్టల్ విద్యార్థినిపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైసిపి సీనియర్ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లోని బిసి బాలికల వసతిగృహాన్ని ఆమె బుధవారం సందర్శించారు. వసతిగృహం సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహంలో ఉండాల్సిన బాలిక ఎలా బయటకు వెళ్లిందని ప్రశ్నించారు. సిబ్బంది అనుమతి లేకుండా బయటకు ఎలా వెళ్తుందని నిలదీశారు. బాలిక తల్లి ఫోన్ చేసి అడిగితేగాని ఈ ఘటపై సిబ్బందికి తెలియకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తరువాత మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఆర్థిక పరమైన సమస్యలతో సతమతమవుతూ పిల్లలను చదివించుకునేందుకు ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తున్నారన్నారు. హాస్టళ్లలో వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆమె వెంట రూడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

మహిళలపై దాడులు పెరిగాయి : మాజీ ఎంపీ భరత్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు పెరిగాయని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. బాలికపై అత్యాచారం ఘటన నేపథ్యంలో స్థానిక బిసి హాస్టల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, క్రైం రేటు రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. ఇది ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి ప్రధాన కారణమన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని తక్షణం అరెస్ట్ చేయ్యాలని డిమాండ్ చేసారు.భరత్ వెంట వైఎస్ఆర్ సిపి రాజమహేంద్రవరం పార్లమెంటు ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ వెంటనే పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించనందున నిలిచిపోయిన ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, ఆసుపత్రులకు బకాయిలు చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పది రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోయాయన్నారు. ఫలితంగా రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద ఆసుపత్రుల్లో చేర్చుకోవట్లేదన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరోగ్యశ్రీ వైద్య సేవలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోగులు ఖరీదైన వైద్యం చేయించుకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. పభుత్వ ఆసుపత్రులకు కొంతమంది షిఫ్ట్ అవుతున్నా తగిన డాక్టర్లు, సిబ్బంది, మౌళిక సదుపాయాలు లేక సరైన వైద్యం అందట్లేదన్నారు. బడా కార్పొరేట్లకు, పారిశ్రామిక వేత్తలకు వేలకోట్ల రూపాయలు రాయితీలు, ప్రకటిస్తున్న కూటమి ప్రభుత్వం పేద ప్రజల వైద్యం కోసం అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి, ఆసుపత్రుల యాజమాన్యంతో చర్చించి, పేదలకు వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగేటట్లు చూడాలని కోరారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు, సాయి హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ 13 రోజులుగా ఎన్‌టిఆర్ వైద్య సేవా నెటవర్క్ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు ఆగిపోయాయన్నారు. పేరుకు పోయిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీకి సంబంధించిన ఒపి పూర్తిగా నిలిపి వేశామన్నారు. తమ హాస్పిటల్స్‌లో 80 శాతం బెడ్స్ ఆరోగ్యశ్రీ పేషంట్లతో నిండి ఉండేవని, ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయన్నాయన్నారు. ఇన్ పేషంట్లకు మాత్రం వైద్యం అందిస్తున్నామన్నారు. బకాయిలు చెల్లించక పోవడంతో హాస్పిటల్స్‌ను నడపలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డిఆర్ చెల్లింపులో వాయిదాలు సరికాదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఒక డిఎ ఇవ్వడం హర్షణీయమని, అయితే డిఆర్ చెల్లింపుల్లో వాయిదాల పద్ధతి సరికాదని ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు అన్నారు. సంఘ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 21 నెలల బకాయిలు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి, ఆపై ఏడాది (2027) ఫిబ్రవరి వరకు నాలుగు వాయిదాలుగా చెల్లిస్తాననడం తగదన్నారు. ప్రభుత్వ నిర్ణయంలో విశ్రాంత ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోనికి తీసుకున్న దాఖలాలు కనిపించట్లేదన్నారు. ఇప్పటికే మరో మూడు డిఎలు బకాయి ఉందని, ప్రస్తుత డిఆర్ చెల్లించే లోపు మరో మూడు విడతలు పేరుకు పోతాయన్నారు. అంత సమయం వరకూ తాము బతికి ఉంటామనే ఆశలేదన్నారు. విశ్రాంత ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుని మొత్తం చెల్లింపు ఒకే సారి చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉరింకల సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐవి.సుబ్బారావు, నల్లి విజయమోహన్, విన్నకోట సాంబశివరావు, డిఎజెబి ప్రసాద్, బండారు రవీంద్ర, రంగారావు, కేశవరావు, అప్పారావ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధర్మరాజు

కార్టూ'నిజం'

పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో వివిధ పథకాల కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో మొత్తం 922 పనులకు రూ.238.14 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 47 పనులు పూర్తికాగా, 68 పనులు కొనసాగుతున్నాయి, ఇంకా 808 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. రహదారుల నాణ్యతపై తప్పనిసరిగా ఆడిట్ నిర్వహించాలన్నారు. భారీ వాహనాల రాకపోకలు ఉన్న ప్రాంతాల్లో బలమైన, దీర్ఘకాలిక రహదారులను నిర్మించాలని తెలిపారు. జిల్లాలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.7.12 కోట్లతో రెండు పనులు చేపట్టారని, ఒకటి పూర్తయ్యిందన్నారు. నాబార్డ్‌లో భాగంగా రూ.24.62 కోట్లతో 13 పనులు చేపట్టాల్సి ఉందన్నారు. పది పనులు కొనసాగుతుండగా మరో 3 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఎపిఆర్ఆర్‌పి పథకం రూ.45 కోట్లతో ఒక పని మంజూరై ప్రస్తుతం పురోగతిలో ఉందని తెలిపారు. గోపాలపురం నియోజకవర్గ పరిధిలో 7 సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు రూ.1.24 కోట్లతో 7 పనులు మంజూరయ్యాయన్నారు. 2025-26లో ఉపాధి హామీ కింద 869 పనులు రూ.152.05 కోట్లుతో మంజూరయ్యాయన్నారు. వాటిలో 32 పూర్తయ్యాయని, 51 పురోగతిలో ఉండగా, 786 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఎంపీ ల్యాడ్స్ రూ.6.25 కోట్లతో 22 పనులు నిర్వహించాల్సి ఉందన్నారు. 2 పూర్తయ్యాయని, 2 పనులు కొనసాగుతుండగా 18 ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. జిల్లా మినరల్ ఫండ్ కింద 8 పనులు రూ.1.85 కోట్లుతో పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి కె.బాలకృష్ణ, డ్వామా ఎపిడి బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల మీదుగా దువ్వ నుంచి తాడేపల్లిగూడెం వరకూ బస్సు సౌకర్యం కల్పించాలని ఉండ్రాజవరం మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ షాజహాన్ ప్రభుత్వాన్ని కోరారు. నిడదవోలులో బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతున్న కారణంగా రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లే పలు డిపోలకు చెందిన ఆర్‌టిసి బస్సులుఉండ్రాజవరం, పెరవలి మీదుగా తాడేపల్లిగూడెం చేరుకుంటున్నాయి. ఈ కారణంగా మండలంలో కొత్త రూట్లు ఏర్పాటు చేయకపోయినా, కనీసం బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేంతవరకు నిడదవోలు మండలం మునిపల్లి నుంచి వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం మీదుగా దువ్వ నుంచి తాడేపల్లిగూడెం వెళితే ఈ గ్రామాలకు అదనపు సౌకర్యం కలుగుతుందన్నారు. డిపోలకు కూడా ఆయిల్ ఖర్చు, కిలోమీటర్ రేషియో కూడా లాభదాయకంగా ఉంటుందని ఆయన తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ ప్రజల అవసరాల దృష్ట్యా ఆలోచించి, నిర్ణయం తీసుకుంటే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పథకం కూడా ఆయా గ్రామాల ప్రజలు ఉపయోగించుకునేందుకు వీలవుతుందన్నారు.

తూర్పు గోదావరి జిల్లా సంక్షిప్త వార్తలు

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న పది మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ బుధవారం తెలిపారు. వివరాల ఇవి.. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా మండల కేంద్రం శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిబిరంపై ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి పేకాడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.3050 స్వాధీనం చేసుకుని నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే వారిపై ఎపి గేమింగ్ యాక్ట్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి-కడియం

మండలంలో కడియపులంక (బుర్రిలంక) గోకుల్ నర్సరీ సమీపంలో 216ఎ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. హైవే పెట్రోలింగ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు గాజువాక మండలం అగనంపూడికి చెందిన దాసరి కిరణ్‌కుమార్(26) విజయవాడ నుంచి విశాఖకు కారులో వెళ్తున్నాడు. బుధవారం ఉదయం కడియపులంకకు చేరుకున్నాడు. ఈ సమయంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే సేఫ్టీ అధికారులు క్రేన్ సహాయంతో లారీ నుంచి కారును వేరు చేసి మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని చిత్రాడ ప్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసును పిఠాపురం పోలీసులు చేదించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన చిత్రాడ ప్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని వాసంసిట్టి పెద్దిరాజు వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి తల, శరీరంపై గాయాలతో మృతదేహం ఉన్నట్లు విఆర్ఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సాంకేతిక ఆధారాలు, సిసి ఫుటేజీలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా మృతుడు తమిళనాడులోని థేని జిల్లా, మనుతు గ్రామానికి చెందిన పాండేగా గుర్తించామన్నారు. మృతుడు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో తినుబండారులు తయారు చేసే ఫ్యాక్టరీలో పని చేసేవాడని, అతనికి పనిలో పరిచయస్థులు అయిన తమిళనాడుకి చెందిన మడసామి, పాల్ రాజ్ ఆండోనీ, లౌర్దు పకీయం ఈ నెల 6న పూచి ధనలక్ష్మి భర్త రామస్వామికి ఆరోగ్యం బాగా లేనందున అతనిని చూడటానికి పట్టణంలోని జగ్గయ్య చెరువు కాలానీకి వచ్చారు. ఈ సందర్భంగా ధనలక్ష్మితో పాండే అసభ్యంగా ప్రవర్తించడంతో 7వ తేదీ ప్లేఓవర్ బ్రిడ్జి సమీపంలోని పంట పొలాలలో మడసామి, పాల్ రాజ్ ఆండోనీ, లౌర్దు పకీయం, ధనలక్ష్మి, ఆటో డ్రైవర్ దాగంటి గణేష్ కలిసి పాండేను రాయితో తలపై కొట్టి హత్య చేశారు. నిందితులను ఉప్పాడ కొత్తపల్లి గ్రామ శివారులో అరెస్టు చేసి, ఆటోను, నిందితుల ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ఈ సమావేశంలో ఎస్ఐలు మణికుమార్, జాన్ భాషా, రామకృష్ణ, వెంకటేష్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వెండి వస్తువుల అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

పోగొట్టుకున్న వెండి వస్తువులను సామర్లకోట పోలీసులు తిరిగి సేకరించి పోగొట్టుకున్న వారికి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా సిఐ ఎ.కృష్ణభగవాన్ మాట్లాడుతూ ఏలేశ్వరం మండలం కంబాలపాలెం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చెందిన సుమారు ఒకటిన్నర కిలోల వెండి వస్తువులు మార్చుకునేందుకు ఆలయ కమిటీ సభ్యులు కొప్పిశెట్టి సత్తిబాబు, సొంటెపు బాలకృష్ణ కాకినాడ తీసుకెళ్లా మార్గమధ్యలో సంచి తెగిపోయి వెండి సామాన్లను పోగొట్టుకున్నారు. వారు సామర్లకోట పోలీసులను ఆశ్రయించగా హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ నాగరాజు వాటిని మెయిన్ రోడ్‌లో కనుగొన్నట్టు చెప్పారు. సంచిపై నుంచి వాహనాలు ఎక్కడంతో ఆలయ సామాగ్రి కొంతవరకు పాడవగా వాటిని శుభ్రపరచి ఆలయ కమిటీ సభ్యులకు తిరిగి అప్పగించినట్టు చెప్పారు. పోగొట్టుకున్న స్వామివారు, అమ్మవారల వస్తువులు వెతికి అప్పగించిన పోలీసులకు ఆలయ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాన్ ఢీకొనడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని బుధవారం బైపాస్ రోడ్డుపై మోటారుసైకిల్ వ్యాను ఎదురె దురుగా ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా ఇద్దరికి తీవ్రంగా గాయలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పంచాయతి పరిధిలోని బైపాస్ రోడ్డు పెట్టా వారి పేట సమీపంలోని శ్మశాన వాటిక సమీపంలో బుధవారం యానాం సుభద్రనగర్‌కు చెందిన మట్టపర్తి నూకరాజు, భార్య నూకరత్నం, కుమారుడు మట్టపర్తి రామ వెంకట కష్ణ ప్రసాద్ అప్పనపల్లి గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని మోటారు సైకిల్‌పై తిరిగి వస్తున్నారు. ఈ సమయంలోనగర పంచాయతీ బైపాస్ రోడ్డులోని కాశి వాని తూము సమీపంలో యానాం నుంచి అమలాపురం వైపు వెళ తున్న కోళ్ళ పారం వ్యాను వేగంగా వెళ్తూ మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనలో కష్ణ ప్రసాద్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన నూకరాజు, నూకరత్నంలను అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మృత దేహాన్ని శవ పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగాలమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం గ్రామ శివారున ఉన్న గంగాలమ్మ ఆలయంలో 750 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం పక్కనే ఉన్న టీషాపులో రూ.10వేల నగదు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. ఘటనా స్థలాన్ని గోకవరం పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

కడియం హైస్కూల్లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ హైస్కూల్లో మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జిఎఫ్ఐ) వాలీబాల్ అండర్-17 బాల, బాలికలకు పోటీలు బుధవారం నిర్వహించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ పాల్గొని పోటీలు ప్రారంభించారు. బాలుర విభాగంలో జేగురుపాడు ఉన్నతపాఠశాల జట్టు మొదటి స్థానం, మురమండ ఉన్నత పాఠశాల జట్టు రెండో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కడియం ఉన్నత పాఠశాల జట్టు మొదటి స్థానం, కడియపులంక ఉన్నత పాఠశాల జట్టు రెండో నిలిచాయి. ఈ సందర్భంగా మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వెలుగుబంటి నాని, గారపాటి సత్య, గారపాటి తాతబ్బాయి, గ్రీన్ ల్యాండ్ బాబీ, చిలుకూరి ప్రభ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి ప్రసాద్

పేదలకు అండగా వెంకటకృష్ణచౌదరి

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని అరుంధతి పేటలో ఇండుగుమిల్లి సతీష్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న గాలింకి శీను, మద్దిపాటి చంటియ్య కుటుంబాలను టిడిపి నాయకుడు గద్దె వెంకటకృష్ణచౌదరి పరామర్శించారు. వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటకష్ణ చౌదరిమాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.అనంతరం ఇటీవల మరణించిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మద్దిపాటి సుజీరాజు, నీరుకొండ శివ, గద్దె శ్రీనివాస్, ఈదుగుపల్లి పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బుధవారం నుంచి 30 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భారతి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మండలంలోని ముగ్గళ్ల ఎంపిపి పాఠశాల, కాటవరం మహతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఈ ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్ర మట్టి తవ్వకాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

లాటిరైట్ (ఎర్రమట్టి) తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు గిరిజనులు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం అనకాపల్లి జిల్లాకు నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడ గ్రామాల్లో చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ చేబ్రోలు గ్రామంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ క్యాంప్ కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. బబిడికలొద్ది, తొరడ గ్రామాల వెల్ఫేర్ సొసైటీ గిరిజనులు ఎం.నూకరాజు, శాంతి మాట్లాడుతూ ప్రకృతిపై ఆధారపడుతూ కొండపోడు వ్యవసాయం చేసి జీవనం సాగించే వాళ్ళమని, కానీ లాటిరైట్ తవ్వకాలతో కొండపోడు వ్యవసాయం లేక తమ జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్ర మట్టి తవ్వకాలతో లారీలు తిరగడంతో ప్రమాదాలు బారిన పడి ప్రాణాలు కోల్పోతూ భయాందోళనలో బతుకుతున్నామన్నారు. దీనిపై ఇదివరకే లాటిరైట్ మైనింగ్ రద్దు కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామని తెలిపారు. లాటిరైట్ తవ్వకాలు తరలింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు ఎం.నూకాలమ్మ, టి.చెల్లయ్యమ్మ, సంకులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ తరగతులు నిర్వహించారు. బుధవారం పిఆర్ గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ ఎన్.రమేష్ ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగాలను వివరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదనీ, డ్రైవర్ పక్కన లేదా వెనుక భాగంలో కూర్చోరాదని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఎస్ఐ పి.కిషోర్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎటాబ్స్ ఉపయోగించి నిర్మాణం విశ్లేషణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెనెసిస్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్ట్రక్చరల్ ఇంజనీర్ మోహన్ బలగ పాల్గొని అవగాహన కల్పించారు. కోర్సు సమయంలో, విద్యార్థులు ఎటాబ్స్ సాఫ్ట్‌వేర్‌పై ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. స్ట్రక్చరల్ మోడలింగ్, విశ్లేషణ మరియు డిజైన్‌కు ఆచరణాత్మకంగా వివరించారు. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాన్ని పెంచిందని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చదువు పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఉద్యోగమే పరమావధి అనుకోకుండా స్వయం ఉపాధిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్‌వర్మ అన్నారు. బుధవారం స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో 20 రోజులు పాటు నిర్వహించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కేవలం ఉద్యోగాల పైనే ఆధారపడకుండా ఉద్యో గాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. థ్రెడ్స్ ఐటి, ఐఐసి ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని తెలిపారు. వ్యాపార మెలుకువలు, ప్రభుత్వ సబ్సిడీ, యంత్రాల కొనుగోలు రుణాలపై వివరించారు. శిక్షణకు 30 మంది విద్యార్థులను ఒక్క గ్రూపుగా విభజించి 20 రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత, డిప్యూటీ ఎంపిడిఒ ఎంవిఆర్ఆర్.వర్మ, పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.గణపతి, ఐఐసి ప్రెసిడెంట్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎంఇ జిల్లా కోఆర్డినేటర్ వైస్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

కొనుగోలు కేంద్రంలో పూజలు చేస్తున్న నవీన్

స్థానక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుధీర్, నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ డికె.నాయక్ మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2389, గ్రేడ్ ఏ క్వింటా ధాన్యానికి రూ.2369 చొప్పున చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతుల తన ధాన్యాన్ని శుభ్రం చేసుకుని తేమ శాతం 17 శాతం కంటే తక్కువ ఉండేలా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని పిలుపునిచ్చారు. రైతులు సులువైన పద్ధతిలో ధాన్యాన్ని అమ్ముకునేలా ప్రణాళికను తయారు చేయాలని అధికారులకు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సూచించారు. రైతులకి అవసరమైతే డ్రైవర్లను మార్కెట్ కమిటీల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయి రాష్ట్ర ఛైర్మన్ సుధీర్ అన్నారు. ఈ సందర్భంగా జెడ్.రాగంపేటకు చెందిన రైతు వెంకట్రావుకు మంజూరు అయిన డ్రోన్‌ను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎఎంసి ఛైర్మన్ అడప భరత్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, ఆర్‌డిఒ శ్రీరమణి, తహశీల్దార్ శ్రీనివాస్, స్థానిక నాయకులు కందుల చిట్టిబాబు, జాస్తి వసంత, వ్యవసాయ అధికారి లక్ష్మి, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

హోం శాఖపై పవన్ పగబట్టారా : మేడా శ్రీనివాస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

అనిత నిర్వహిస్తోన్న హోమ్ శాఖపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పగబట్టారా? అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సొంత నియోజక వర్గం పిఠాపురంలో జరుగుతున్న నేరాలపై దృష్టి సారించని పవన్ భీమవరంలోని జూదాల కోసం డిఎస్‌పిపై సీరియస్ అవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ అంశంలో మరో కోణం దాగి ఉందన్నారు. పవన్‌కళ్యాణ్ ఉన్నతాధికాలను నివేదిక కోరడం కాదని, అంతర్గత నివేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రప్పించుకుంటే వాస్తవాలు బయటకొస్తాయన్నారు. పవన్‌కళ్యాణ్ సొంత శాఖపై కన్నా ఇతరుల శాఖలపై దృష్టి ఎక్కువ పెడుతున్నారని విమర్శించారు. హోం మంత్రి అనితను టార్గెట్ చేస్తూ మాట్లాడటం, పలు మార్లు వివమర్శలు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. ఆయన వ్యవహారశైలిపై అనుమానం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అనితమ్మకు పవన్ కళ్యాణ్ ఎసరు పెట్టడానికి కుట్ర పన్నుతున్నట్టు అనిపిస్తుందని మేడా శ్రీనివాస్ అన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో, స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న 46 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన ఎనిమిది మందిని ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు సంస్థ ప్రతినిధి జి.అజోర్ తెలిపారు. 16 మందికి కళ్ళద్దాలు అవసరం కాగా రాయితీపై వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు.

పరామర్శిస్తున్న అభిరామ్

పోసియ్య కుటుంబానికి అభిరామ్ పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం గ్రామ టిడిపి సీనియర్ నాయకులు జానం పోసియ్య అల్లుడు బైక్ ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ మునిపల్లి గ్రామం వెళ్లి మతుని కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. టిడిపి వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు నీరుకొండ వెంకటేశ్వరరావు, కొడవటి వెంకటరామారావు తదితరులున్నారు.

ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ

దాతల ఔదార్యం మరువలేనిది

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని తీర్చడానికి పాఠశాల అభివద్ధికి ముందుకు వస్తున్న పూర్వ విద్యార్థులు, దాతల ఔదార్యం మరువలేనిదని ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ అన్నారు. అన్నదేవరపేట ఎంపిపి మెయిన్ పాఠశాలకు దాతలు అందించిన ఆర్ఓ ప్లాంట్‌ను వారు బుధవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దాత ఇంజరపు వెంకటకృష్ణసత్యనారాయణ అందించిన రూ.10వేలు, పూర్వ విద్యార్థి పాతూరి సత్యనారాయణ తండ్రి రత్నాజీరావు జ్ఞాపకార్థం అందించిన రూ.15 వేలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న గెడ్డం దైవ వరకృపప్రసాద్ రూ.30వేల సొంత నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దాతలను, హెచ్ఎం, ఎంఇఒలు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాననిధిలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతానగరం

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సీతానగరం మండలంలోని జ్ఞాననిధి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ భద్రత గురించి వివరించారు. చిన్నపిల్లలపై లైంగిక దాడుల నివారణకు సంబంధించి, సురక్షితమైన స్పర్శ, అసురక్షితమైన స్పర్శ మధ్య తేడాలను వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని జ్ఞాననిధి పాఠశాల యాజమాన్యం మంగరాజు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర ఆధ్వర్యంలో 'జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలపై అంతర్జాతీయ సదస్సు' నవంబర్ 21, 22నకళాశాల ప్రాంగణంలో జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర బుధవారం ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చి సుస్థిర పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు అంశంపై ఆలోచనలు పంచుకోవడం మరియు కొత్త పరిశోధన మార్గాలను అన్వేషించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సదస్సులో ఐఐఎస్‌సి బెంగుళూరు నుంచి శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఆర్.ప్రసాద్ గారు, దేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. అమెరికాకు చెందిన ఇద్దరు పారిశ్రామికవేత్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. దీన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.శ్రీధర్, సహాయ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి.తేజస్విని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

ఇంటి నాగలక్ష్మి, W/o. సత్యనారాయణ మూర్తి, డోర్ నెం. 6-21, వెలగతోడు, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ దస్తావేజు నెం. 10089/1984, Dt. 03-12-1984,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ వారి ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన దస్తావేజు **ది. 18-10-2025వ తేదీన** నేను ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

ఇంటి నాగలక్ష్మి
సెల్: 9553298333

పిఎసిఎస్‌లో ఎరువుల స్టాకు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

కోరుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు శశిబిందు ఆధ్వర్యంలో ములకల్లంక, మిర్తిపాడు, రఘుదేవపురం పిఎసిఎస్‌ల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తించిన కారణంగా మూడు వ్యవసాయ సహకార సంఘాల్లో అమ్మకాలు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల చట్టాన్ని అనుసరించి మాత్రమే వ్యాపారం చేయాలని, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్స్, ఈ-పాస్ బ్యాలెన్స్‌లను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఘనంగా కొమరం భీమ్ జయంతి

ప్రజాశక్తి - గోపాలపురం

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు కొమరం భీమ్ అని హెచ్ఎం కాకి పోసియ్య అన్నారు. బుధవారం పెద్దాపురం ప్రభుత్వ పాఠశాలలో కొమరం భీమ్ జయంతిని నిర్వరహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి, అమరుడైన యోధుడు కొమురం భీమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నమణి, సనపల రాజశేఖర్, మెడికల్ సిబ్బంది సౌజన్య, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - తాళ్లపూడి

కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తుందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్దేవం, వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన రూ.1.37లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన బుధవారం అందించారు. ప్రమాదంలో మృతి చెందిన తిరుగుడు మెట్టకు చెందిన టిడిపి క్రియాశీల సభ్యత్వం కలిగిన మెంటే చంద్రశేఖర్‌కు మంజూరైన రూ.5లక్షల ఇన్సూరెన్స్‌ను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సిద్ధ దుర్గారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు : ఎంఎల్ఎ వాసు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

తప్పు చేస్తే చర్యలు తప్పవని, బాలికపై అత్యాచారం చేసిన నిందుతులను వదిలే ప్రశక్తే లేదని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బాలికపై అత్యాచారం ఘటనలో పోలీ సులు నిష్పక్షపాతంగా వ్యవహారిం చాలన్నారు. హాస్టల్‌కు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు చూసిన తరువాతనే లోపలికి అనుమతించాలన్నారు. బాలి కను బయటకు పంపించిన హాస్టల్ వార్డెన్, సిబ్బందికి నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

In the Court of the III Additional Senior Civil Judge at Kakinada
H.M.O.P. No. 102/2025

Between:
Smt. Anasuri (Kopparthi) Manikyamba ***...Petitioner***
AND
Anasuri Mani Kumar ***...Respondent***

To:
Anasuri Mani Kumar, S/o. Ganga Raju, Hindu, aged 26 years, Business, R/o. Nakkala Y.Savaram, Peddapurapadu Village, Karapa Mandal, Kakinada District.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భర్త అయిన మీపై విడాకులు కోరుతూ పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు సమన్లు పంపించినానూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 12-11-2025 తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పితాని శ్రీనివాసరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440614459

NOTICE UNDER SECTION 13(1) (a) & (b) of HINDU MARRIAGE ACT IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE AT NARASIPATNAM
H.M.O.P. No 14/2025

Between:
Peddireddi Karuna ...Petitioner
And:
Peddireddi Ramu ...Respondent
To
Peddireddi Ramu S/o Veerraju, aged 35 years, Hindu, Mason, Residing at Yeditha village, Mandapeta Mandal, Konaseema Ambedkar District.

NOTICE TO RESPONDENT

Please take notice that the above H.M.O.P petition filed the petitioner seeking for decree of divorce by dissolving the marriage between petitioner and you 01.05.2014 at Aryapuram, Rajahmundry (T), East Godavari District and for such other relief or reliefs and the notices of this court was not served so you are hereby directed to appear before the court may approach this court in person or through an Advocate and file necessary Proof of your claim on **14.11.2025 at 10.30 A.M,** failing which the matter will be decided as exparte.

(By Order of the Court)
R.B.NAIDU
Narsipatnam. Advocate,
Date: 21.10.2025. Narsipatnam

IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT KAKINADA
I.A.No.436/2022,
FDP.No.7/2021,
OS.No.66/1999

Between:-
Jyothula Achayamma @ Buli Ammayi (Died)and Other's **...Petitioners/Plaintiffs**
And
Togaru Tulasamma and Other's
...Respondents/Defendents

To.
Respondent-6
Togaru Devi, D/o. Late Togaru Somayya @ Krishna, Vemulavada, Karapa Mandal (Legal Representative of 2nd Respondent)

పై నెంబరు ఫైనల్ డిక్రి పిటిషన్ లో మీరు 6వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారిద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.05-11-2025** వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగాగాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల ఫైనల్ డిక్రి పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వింజమూరి వెంకట్రావు
అడ్వకేట్, కాకినాడ
సెల్.9866550610

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టు, కాకినాడ
O.P. No. 233/2022
I.A. No. 1119/2025
I.A. No. 1120/2025

Between:
నేలపాటి వర్షిత -పిటీషనర్
మరియు
నేలపాటి రవికుమార్ -రెస్పాండెంట్

To:
నేలపాటి రవికుమార్, S/o. late జయరాజ్, డోర్ నెం. 24-8-130/11, కచేరిపేట, అంబేద్కర్ కాలనీ, కాకినాడ-1, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ పిటీషను దాఖలా చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు సమన్లు పంపించినానూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 29-10-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కడియాల వి.వి.యస్.యన్.మూర్తి
ఎ.భవాని, బి.రాంబాబు
కె.హిమబిందు, అడ్వకేట్లు
కాకినాడ, సెల్: 9949394515

In the Court of the V Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 222/2025

Between:
Chukka Lovaraju ***...Plaintiff***
AND
Vemagiri Nookaratnam & Others ***...Defendants***

To: ***Defendants:***
1) Vemagiri Nookaratnam, W/o. (late) Baburao, House wife, SC Peta, 4th Street, Last Building, Kothuru Colony, V.K.Rayapuram, Samalkota Mandal.
2) Vemagiri Srilakshmi, D/o. (late) Baburao, SC Peta, 4th Street, Last Building, Kothuru Colony, V.K. Rayapuram, Samalkota Mandal.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-11-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యనమల రామం
అడ్వకేట్, సర్పవరం జంక్షన్
కాకినాడ, సెల్: 9849083925

In the Court of the III Additional District Judge at Kakinada
F.D.P. No. 4/2025 in
O.S. No. 81/2013

Between:
Kanduri Durga Suryakala & Others
...Petitioners/ Plaintiffs
AND
Kanduri Venkata Satya Siva Subrahmanya Surya Sriram and Others
...Respondents/ Defendants

To:
R-1: Kanduri Venkata Satya Siva Subrahmanya Surya Sriram, S/o. Sarveswara Rao, R/o. Plot No.104, Vanasthalipuram, Hyderabad.
R-2: Kanduri Ramalakshman, S/o. Sarveswara Rao, R/o. Plot No. 107, Siva Sai Flora, Dilsuuk Nagar, Hyderabad.
R-3: Jalumuri Venkata Subba Rao Suraj, S/o. Soma Raju, R/o. D.No. 35-2-42, Penkey vari Street, Kakinada.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో 1 టు 3 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 28-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై ఫైనల్ డిక్రీ పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వింజమూరి వెంకట్రావు, అడ్వకేట్,
కాకినాడ, సెల్: 9866550610